# పరేశుడు

## శరత్ బాబు



కుంజపురంలో ముజుందారు వంశం పరువు ప్రతిష్ఠలు గలది. గ్రామస్థులు వారిని గౌరవిస్తారు. ఇప్పుడా వంశానికి పెద్ద గురుచరణుడు. ఆ వంశానికే కాదు – గ్రామానికే పెద్ద అనవచ్చు. ఆయనకంటే భాగ్యవంతులు ఆ గ్రామంలో లేకపోలేదు. అయినా గ్రామస్థులు ఆయనకు చూపే మర్యాదా, భక్తీ వేరు. ఆయన పెద్ద ఉద్యోగం ఏదీ చేయలేదు. అంటే దొరకకకాదు; ఆరోజుల్లో ఊరు వదలిపెడితే పెద్ద ఉద్యోగం దొరకడమంత కష్టంకూడా కాదు. అయినా పక్క గ్రామంలోని గవర్నమెంటు స్కూల్లో ముప్ఫయిరూపాయల మాస్టరుపనికి తృప్తి పడ్డాడు. దాంట్లోనే యాభైరూపాయలవరకు ప్రమోషను సంపాయించాడు. ఇప్పుడు – మూడు సంవత్సరాలనుంచీ పాతికరూపాయల పెన్షను తీసుకుంటున్నాడు! ప్రపంచంలో ఇంకా, ధనమే ముఖ్యం కాలేదనుకుంటాను. లేకపోతే గ్రామస్థులు తగువొచ్చినా, పేచీ వచ్చినా ఆయనమాట ప్రకారం సర్దుకునేవారు కారు. అసలు ఆయనను మధ్యవర్తిగానే ఎన్నుకునేవారు కారనుకుంటాను! ఆయన ధర్మనిష్ఠకూ, నడతకూ, మంచితనానికీ అంతా లోబడేవారు. ఆయనకిప్పుడు అరవయ్యోపడి – చుట్టుప్రక్కల అయిదారు గ్రామాల్లో ఎవరన్నా డాంబికంగా తాను న్యాయపరుడనని చెప్పుకుంటే అంతా వాణ్ణి ఎగతాళిగా 'వచ్చాడోయ్ గురుచరణుడు!' అనేవారు. గురుచరణునికి భార్యపోయింది; కొడుకున్నాడు; విమలుడు. ఈ ప్రపంచంలో నిజంగా అద్భుతమనేది ఏదీ లేదనుకుంటాను. లేకపోతే ఇన్ని మంచి గుణాలున్న తండ్రికి ఇన్ని దుర్గుణాలున్న కొడుకెలాపుడతాడు!

కొడుక్కూ తండ్రికీ కుటుంబ సంబంధమేమీ లేదనే చెప్పవచ్చు, ఒకవిధంగా. కాని తమ్ముడి కొడుకు పరేశునిమీద మాత్రం గురుచరణుని ఆశలన్నీ ఉన్నాయి. అతన్నే సొంత కొడుకుగా చూసుకునేవాడు. ఇప్పుడతను యం. ఏ. పాసై 'లా' చదువుతున్నాడు. అక్షరాభ్యాసం దగ్గరనించి ఇప్పటివరకు పెద్దతండ్రి సహాయంతోనే అతను నెట్టుకొస్తున్నాడు.

గురుచరణుని తమ్ముడు హరిచరణుడు కలకత్తాలో మామూలు నౌకరీ చేస్తూ ఉండేవాడు. కాని యుద్ధమైపోయినాక హఠాత్తుగా పని వదలిపెట్టి ఇంటికొచ్చాడు. ఊళ్ళోవాళ్ళకు యెక్కువవడ్డీకి అప్పులివ్వసాగాడు. రెండోసంబంధం భార్యపేర ఒకతోటకూడా కొన్నాడు. ఇంకా యిలాంటివే రెండు మూడు పనులు చేయటంమూలాన ఈయనదగ్గర డబ్బున్నదని చుట్టుప్రక్కల గ్రామస్థులుకూడా వాసనపట్టారు.

ఒకనాడు హరిచరణుడు అన్న దగ్గర కొచ్చి చాలా వినయంతో "అన్నయ్యా! చాలాకాలంనుంచి నీ కొకమాట చెప్పాలనుకుంటున్నాను," అని మొదలుపెట్టాడు.

"ఏమిటో చెప్పు," అన్నాడు గురుచరణుడు.

హరిచరణుడు కాసేపు వెనకాముందాడి అన్నాడు: "ఏమీలేదు. మీ రొక్కరూ ఇంకా ఎంతకాలం శ్రమపడతారు. వయస్సుకూడా–"

"ఆ. ఇప్పుడరవై జరుగుతున్నది."

"అందుకనే. ఇప్పుడు నే నెలాగూ ఇంటిదగ్గరే ఉంటున్నాను. ఆస్తి చూద్దామా ఎటుదటే పోతున్నది. ఫలానిది ఫలానివారికని–"

"ఏమంత పెద్దాస్తి మనది, ఎటుదటు

పోవటానికి ? నీ ఉద్దేశం భాగాలు పంచుకోవాలనా ?"

హరిచరణుడు సిగ్గుపడ్డాడు — "అదికాదు. ఇప్పు డెలా జరుగుతున్నదో ముందుకూడా అలానే జరుగుతుంది. ఇప్పుడు మనకున్నది ఫలానిది ఫలానివారికని అనుకుంటే బాగుంటుందిగా. అదీకాక, ఈవంట ఒక జంఝాటం. సేద్యం కలిసివున్నా కూరా, నారా — తెలిసిందిగా."

"ఎందుకు తెలియదు ? సరే, రేపటినించి అలానే చేసుకుందాము."

"భాగా లెలా నిర్ణయించారు ?"

"నిర్ణయించటాని కేముంది ? మూడు భాగాలు వేసుకుందాం."

"మూడుభాగా లెలా ? వదినకు పిల్లలు కూడా లేరుకదా. విధవవావిడ ఒక్కతే భాగ మేమి చేసుకొంటుంది ?"

"ఏమిచేసుకొంటే మన కేం ? ఆమె బ్రతికున్నంతవరకూ భాగ మివ్వవలసిందే."

"చట్టప్రకారం భాగంరాదు, మనోవర్తి తప్ప!" అన్నాడు హరిచరణుడు విసుగుతో.

"చట్ట మెందుకు ? ఆమె మనలాంటిది కాదా ?"

"రే పామె ఆస్తిని తాకట్టుపెట్టితే? — అమ్ముకుంటే ?"

"అలాంటి అధికార మామెకుంటే చేస్తుంది."

"ఎందుకు చేయదు ?" అన్నాడు హరిచరణుడు ముఖం మాడ్చుకుని.

మర్నాడు ఉదయమే హరిచరణుడు గొలుసూ, టేపూ చేతబట్టి కొలతలు ప్రారంభించాడు. గురుచరణుడు అదేమని అడగనూలేదు; అడ్డూరాలేదు! రెండు మూడు రోజులకు సున్నం, ఇసుకా, ఇటుకరాళ్లూకూడా వచ్చిపడ్డవి. వారి ఇంటి పురాతనపుదాసీ రామి వచ్చి గురుచరణునితో 'అడ్డం గోడ కడతారట' అని చెప్పింది. గురుచరణుడు నవ్వుతూ "కనపడుతూనే ఉందిగా, వేరే చెప్పడ మెందుకు ?" అన్నాడు.

తర్వాత నాలుగైదు రోజులకు, ఒకనాటి సందెవేళ గురుచరణుడు వాకిట్లో కూర్చుని ఉండగా రామివచ్చి "అమ్మగారు మీకోసం నిలబడివున్నా" రని చెప్పింది.

అమ్మగారు — అంటే గురుచరణుని మరదలు — తలుపు చాటునుండే బావను అడిగింది : "మామగారి — ఆస్తిలో నా కేమీ హక్కులేదా ? చిన్నా విడ రాత్రింబగళ్లు తిట్టుతూ ఉంటుం దెందుకని ?"

"ఎందుకు లేదూ ? ఆమె కెంత ఉందో నీకూ అంత వుంది." అన్నాడు గురుచరణుడు.

"మరి అలా సణుగుతుం దెందుకు? ఇలాగైతే ఇంట్లో ఉండటమే కష్టం." అన్నది మరదలు.

గురుచరణునికి జరుగుతున్న కథంతా తెలుసు. అందుకనే కాస్త ఆలోచించి — "పరేశుని రమ్మని ఉత్తరం రాశాను. ఈ నాలుగు రోజులూ ఎలాగో ఓపికపట్టండి. వాడొస్తే పేచీలన్నీ వదలిపోతై." అన్నాడు.

"పరేశుడు మాత్రం..." అన్నది గురుచరణుని మరదలు సందేహిస్తూ.

గురుచరణుడు మధ్యనే అడ్డి — "వాడిని సందేహించటానికి వీల్లేదు, అమ్మాయీ! వాడికీ నాకూ ఉన్నసంబంధానికి సందేహాలకి తావులేదు. కన్నతండ్రిని కాకపోయినా వాడే నాకు కొడుకు. ప్రపంచమంతా ఎదురు తిరిగినా వాడు నావాడే. ఇప్పటికికూడా వాడు నన్ను గ్రహించలేదంటే నే నింతకాలం వాణ్ణి వృథాగా పెంచానన్నమాట." అన్నాడు.

"ఆమాట చెప్పాలా బాబూ వేరే? ఆ సంవత్సరం స్ఫోటకం పోసినప్పుడు రాత్రింబగళ్ళు మేలుకొని, తమరంత శ్రమపడకపోతే కుర్రవాడు దక్కేవాడా! అప్పు డా తండ్రి ఎక్కడున్నాడు, ఈ మారుతల్లి ఎక్కడుంది? చస్తామేమోననే భయంతో ఒక్కమాటు చూడటానికికూడా రాలేదుగా," అన్నది దాసీ.

"పరేశుని సొంతతల్లి బ్రతికున్నా ఇంతకంటే ఎక్కువచాకిరీ చేసేదికాదు." అన్నది మరదలు.

"ఇప్పుడాసంగ తెందుకు, పోనివ్వం డమ్మా." అన్నాడు గురుచరణుడు. వారు వెళ్ళిపోయిన తరవాత ఆ వృద్ధునికి తన కొడుకు విమలుడూ, పరేశుడూ ఒక్కమాటుగా తలపుకువచ్చి, ఆకాశంవంక చూచి నిట్టూర్చాడు. తర్వాత కర్రచేతపట్టి పాచిక లాడడానికి సర్కారుగా రింటికి బయలు దేరాడు.

మర్నాడు గురుచరణుడు భోజనానికి కూర్చోగానే ప్రక్కగదిలోనుంచి విరామం లేకుండా తిట్లు వినపడసాగినవి. తిట్టేది స్త్రీ — హరిచరణుని వంటయింట్లోనుంచి. ఆయన కిక అన్నం సహించలేదు. పైగా ఆమెకు తోడు ఇంకొక పురుషుడుకూడా కలిశాడు తిట్టటానికి. మరదలు వద్దని ఎంత బ్రతిమాలినా వినకుండా గురుచరణుడు విస్తరిముందునుంచి లేచాడు. వారు సూటీపోటీగా తిట్టేది ఎవరినో రామి బయటపెట్టింది.

గురుచరణుడు ఇంటిముంగిలిలోకి వచ్చి హరిచరణుని సంబోధించి అన్నాడు :

"హరీ! ఆడవాళ్ళేదో అంటూ ఉంటే నే నింతవరకూ చెవిని పెట్టలేదు. నువ్వు మగవాడివై వుండి విధవావిడ నిలా అవమానిస్తూ ఉంటే ఆమె ఈ యింట్లో ఇక ఎలా ఉంటుందీ ?"

ఈమాట కెవరూ జవా బివ్వలేదు. గురుచరణుడు బయటికి పోబోతూవుండగా హరిచరణుని భార్య అంటున్న ఈ మాటలు చెవిని పడ్డవి. ఆమె హేళనగా భర్తతో అంటున్నది: "అలా అవమానించకండి, పాపం ఆమె ఇంట్లో ఉండలేదట. ఆమె వెళ్ళిపోతే ఏమవుతుం దనుకున్నారు !"

హరి అంటున్నాడు : "ఏమవుతుంది ? ప్రపంచం మునిగిపోతుంది! — అసలీమెను ఉండమని ఎవరు బ్రతిమాలారు ? పోతే బ్రతికిపోదుము."

గురుచరణుడు ఆగి అంతా విని మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

* * *

ఈమధ్య హెడ్‌మాస్టరుగారి కుమార్తె పెళ్ళికని గురుచరణుడు కృష్ణనగరం వెళ్లాడు. అక్కడ ఉండగానే పరేశుడు రెండురోజులక్రితం ఊళ్లోకి వచ్చాడనీ, రాగానే జ్వరంపడ్డాడనీ తెలిసి ఆదుర్దాతో పరుగెత్తుకుంటూవచ్చి, ఇంట్లోకన్నా పోకుండా, పరేశుని చూడటానికి వాళ్ళవేపుకు పోయాడు. హరిచరణుడు అప్పుడే వాకిట్లో తారసిల్లాడు. గురుచరణుడు ఆదుర్దాతో అతన్ని "పరేశునికి జ్వరమటగా?" అని అడిగాడు.

హరిచరణుడు మాట్లాడకుండా బయటకు వెళ్ళాడు. చిన్నావిడదాసీది గురుచరణుని లోపలికి పోనివ్వకుండా అడ్డొచ్చి "తమరు లోపలికి పోకండి," అన్నది.

"పోవద్దా? – ఎందుకని?"

"గదిలో చిన్నమ్మగారున్నారు."

"ఆమెను కాస్త తప్పుకోమని చెప్పు."

"ఎలా తప్పుకుపోతారు? అబ్బాయిగారి కణతలు వత్తుతున్నారు," అని దాసీది తన పనిమీద వెళ్ళిపోయింది.

గురుచరణుడు ఏమీ పాలుపోక కాసేపు నిలిచిపోయి, తర్వాత – "పరేశ్! ఎలా ఉన్నావు నాయనా?" అని కేకవేశాడు.


లోపలినుంచి ఈ ఆదుర్దా ప్రశ్న కేమీ జవాబు రాలేదు. కాని దాసీది ఎక్కడో జవాబిచ్చింది – "అబ్బాయిగారికి జ్వర మొచ్చిందని విన్నారుగా!"

గురుచరణుడు కాసేపు స్తబ్ధుడై నిలిచి తర్వాత మెల్లగా బైటకొచ్చి తిన్నగా మళ్లీ స్టేషనకు నడిచాడు.

అక్కడ పెళ్ళిసందట్లో ఎవ్వరూ ఇతనిలో మార్పు కనిపెట్టలేదు. కాని వివాహం కాగానే హెడ్మాష్టరు ఈయన్ని చూసి – "ఏమిటోయ్ గురుచరణ్, సంగతి! హరి బాగా వేధిస్తున్నా డేమిటి?" అన్నాడు.

"హరా? లేదే!" అన్నాడు గురుచరణుడు పరధ్యానంగా.

"లేదేమిటోయ్! అంతా చెప్పుకుంటున్నారు."






గురుచరణుడికి మళ్లీ వెనకటివి జ్ఞాపకం వచ్చి "అదే—భాగాలదగ్గర కాస్త గోల చేశాడు," అన్నాడు.

ఈయన మాట ధోరణికి హెడ్మాష్టరు కొంచెం విసుక్కున్నాడు. వీరిద్దరూ చాలా కాలంనుంచి స్నేహితులు. అయినా గురుచరణుడు తనకు చెప్పకుండా ఏదో దాస్తున్నాడని తెలుసుకుని ఏమీ అడగలేదు.

గురుచరణుడు ఇంటికి తిరిగి వచ్చాడు. ఈయన లేని సమయంలో హరిచరణుడు ఇంటిముందు మెల్లాలో కందకాలూ, గోతులూ తీయించాడు. ఈ వ్యవహారమంతా చూసి ఈయన గ్రహించిం దేమంటే — హరిచరణుడు తన ఇష్టమొచ్చినట్టు భాగాలు వేసి గోడలు కట్టదలచుకున్నాడు—డబ్బున్నవాడు కాబట్టి ఒకరి సమ్మతి అతనికి అనవసరం అని.

గదిలోకిపోయి దుస్తులు తీస్తూ ఉండగా రామి గురుచరణుని మరదల్ని వెంటబెట్టుకొచ్చింది. గురుచరణుడు సంగతేమిటో అడగాలనుకుంటూ ఉండగానే ఆమె భోరున నేలమీద పడి ఏడ్చింది. రామికూడా ఏడుస్తూనే ఈ సంగతులు చెప్పింది:

"మొన్న ఉదయం చిన్నయ్యగారు అమ్మగారిని మెడబట్టి ఇంట్లోనుంచి బయటికి గెంటారు. నేను లేకపోతే ప్రాణాలు కూడా తీసేవారేమో!"

వివరా లన్నీ తెలుసుకోటానికి చాలా సేపు పట్టింది. అంతా విని గురుచరణుడు కాసేపు స్తబ్ధుడై "నిజంగా హరి నీ వొంటిమీద చెయ్యి వేశాడా అమ్మాయీ! వేయగలిగాడూ!" అన్నాడు హఠాత్తుగా.

తర్వాత "పరేశు డింకా మంచంమీద నుంచి లేవలేదనుకుంటాను," అన్నాడు కాసేపుండి.

"ఆయన కే జబ్బూ లేదు బాబుగారూ! ఇవ్వాళ ఉదయం బండికే వెళ్ళిపోయాడు" అన్నది దాసీ.

"లేదూ? ఐతే తండ్రికీర్తి అంతా వినే పోయాడూ?"

"ఆఁ! అంతా."

గురుచరణునికి కాళ్ళకింద భూమి కుంగిపోతున్నట్టయింది. అన్నాడు:

"అమ్మాయీ! వాడి ఈ అపరాధానికి శాస్తి చేయకపోతే మనం ఈ ఇంట్లోనే ఉండనొల్లకాదు. ఇంకా సమయముంది. బండి పిలిపిస్తాను, కచ్చేరీలో చార్జి ఇద్దాము, పద."

చార్జీ అనే సరికి మరదలు చకితురాలైంది. గురుచరణుడు మళ్లీ అన్నాడు:

"సంసారులు కోర్టు కెక్కటం మర్యాద కాదని నాకూ తెలుసు. కాని ఇంత పెద్ద అవమానం నోరు మూసుకుని సహిస్తే భగవంతుడికికూడా కోప మొస్తుంది."

మరదలు నేలమీదనుంచి లేచి నిలబడి "తమకు నాకు తండ్రివంటివారు. తమరు చెప్పినట్టు నేను కళ్ళు మూసుకుని ఆచరిస్తాను," అన్నది.

హరిచరణునిమీద చార్జీ దాఖ లయింది. గురుచరణుడు వెనక ఎప్పుడో కొనుక్కున్న బంగారపు గొలుసు — గడియారానిది — అమ్మి ప్లీడరు ఖర్చులు చెల్లించాడు.

వాయిదానాడు పిలిచారు. హరిచరణుడు హాజరైనాడు. కాని ఫిర్యాది జాడలేదు. వకీలేదో చెప్పాడు కాని మాజిస్ట్రేటు వినలేదు. కేసు కొట్టివేశారు. అక్కడి గుంపులో, హరిచరణుడి కళ్ళు హఠాత్తుగా పరేశునిమీద పడ్డవి. అతను ముఖం చాటుకు తిప్పుకుని మందహాసం చేస్తున్నాడు.

కన్నవారింటిదగ్గరనుంచి ఎవరికో జబ్బుగా ఉన్నదని తంతి రావటంవల్ల మరదలు ఫోంచేయటానికికూడా తీరికలేక బండి చేయించుకుని వెళ్ళిపోయిందని గురుచరణునికి ఇంటి కొచ్చినాక తెలిసింది.

రాము కాళ్లు కడుక్కోటానికి నీళ్ళిచ్చి, ఒక్క పెట్టున ఏడుస్తూ—"అంతా మోసమే బాబూ. మీ రెక్కడికన్నా వెళ్ళిపోండి. ఈ పాపిష్టి ఊళ్ళో మీకు చోటు లేదు" అన్నది.

కేసు గెలిచినందుకు సన్నాయిమేళం, బాండుమేళం పిలిపించి హరిచరణుడు ఊరంతా దద్దరిల్లేటట్టు కాళికి పూజ చేశాడు.

* * *

ఇంట్లో అడ్డుకట్టారు. ఒక భాగంలో హరిచరణుడు, రెండో భాగంలో గురుచరణుడూ రామి ఉంటున్నారు. మర్నాటి ఉదయం రామి వచ్చి "వంటసామగ్రి అంతా సిద్ధం చేశాను బాబూ'' అని చెప్పింది. "సిద్ధం చేశావా ? సరే- వస్తున్నా" అని గురుచరణుడు లేవటాని కుపక్రమించగానే రామి మళ్లీ అన్నది : అంత తొందరేమీ లేదు బాబుగారు, వేళ కానివ్వండి ! అంతకంటే, ముందు స్నానం చేసిరండి."

"సరే వెళ్తాను" అని గురుచరణుడు తక్షణం లేచాడు. ఆయన ప్రవర్తనలో అసంగతమేమీ లేకపోయినా రామికి ఎలాగో ఉన్నది. వెనకటి బాబుగారు కాదని అనుకున్నది.

ఆయన గంగకు వెళ్ళగానే రామి ఇంట్లోకి వచ్చి బిగ్గరగా — "ఎప్పటికీ జయం కలగదు. భగవంతుడు తప్పక శాస్తి చేస్తాడు" అని కేకలు వేయసాగింది.

ఎవరికి జయం కలగదో, ఎవరికి శాస్తి చేస్తాడో పేరెత్తి అనలేదు. అందుచేతనే ఏమో చిన్నవారి వేపునుండి జవాబేమీ రాలేదు.

రోజు లిలా గడిచిపోతున్నై.

తన ఏకైక పుత్రుడు సుపుత్రుడు కాదని గురుచరణునికి తెలుసు. కొన్ని మాసాల క్రిందట ఒక మాటు ఇంటికొచ్చి కొన్ని ఘంట లుండి సూటుకే సొకటి వదలిపెట్టిపోయాడు. అంతే: తర్వాత మళ్లీ ఏ జాడా లేదు. విమలుడు వెళ్ళిపోయినాక గురుచరణుడు పరేశునిపిలిచి సూటుకేసులో ఏమున్నవో చూడమని చెప్పాడు. పరేశుడు చాలాసేపు పరీక్షించి "డాక్యుమెంటులు కావచ్చ"న్నాడు. వీటిని ఉంచటం మంచిది కాదు, తగలేయా లనికూడా చెప్పాడు.

"అవి అవసరమైన డాక్యుమెంటులేమో?" అన్నాడు గురుచరణుడు.

"అవసరమైనవే. కాని అన్నాయికి ఉపయోగించవు. ఇలాంటి కొరివిని ఇంట్లో పెట్టుకోవటం మంచిది కాదు."

"ఏదీ తెలియకుండా పాడుచేయటం మంచిదికాదు పరేశ్ ! ఇతల్లైవల్లైనా నష్టపడిపోవచ్చు. వాటిని నువ్వే ఎక్కడన్నాదాయి, తర్వాత చూసుకుందాము."

ఈ సంగతి మళ్లీ గురుచరణునికి జ్ఞాపకం లేదు. ఆవాళ ఉదయం ఆయన గంగకు పోయి స్నానంచేసి వచ్చేసరికి ఇంటిముందు సూటుకేసు చేతబట్టి పరేశుడూ, పోలీసు ఇన్‌స్పెక్టరూ, హరిచరణుడూ, ఇంకా గ్రామస్థులు చాలామందీ నిలబడి ఉన్నారు. సంగతిది :

విమలుడు దొంగతనంచేసి పరారయినాడట. వార్తాపత్రికల్లో ఈసంగతి చదివి పరేశుడు గవర్నమెంటుకు తనకు తెలిసిన రహస్యాలన్నీ చెప్పాడు. చెప్పటమే కాదు, వెంటబెట్టుకొచ్చాడు పోలీసువారిని.

విమలుడు దుర్నీతిపరుడు. మాంసం తింటాడు, మద్యంతాగుతాడు. ఇంకా వీటితో పాటుండే దోషంకూడా ఇతనిలో ఉంది. కలకత్తాలో ఉండి ఏదో నౌకరీచేస్తున్నాడు. కాని వాడు దొంగతనం చేస్తాడని మాత్రం గురుచరణుడు స్వప్నంలోకూడా అనుకోలేదు.

పోలీసువారడిగిన ఒకప్రశ్నకు గురుచరణుడు కాసేపు పరేశునివంక రెప్పవాల్చకుండా చూసి "ఆఁ, పరేశుడు చెప్పిందంతా సత్యమే" అన్నాడు కన్నీళ్ళుకారుస్తూ.

ఇన్‌స్పెక్టరు ఇంకా రెండుమూడు ప్రశ్నలడిగి ఆయన్ని వదలిపెట్టాడు. తర్వాత వెళ్ళబోయేముందు గురుచరణునికి వంగి నమస్కరించి, తానిటువంటి దుఃఖకరమైన పని జీవితంలో ఎప్పుడూ చేయలేదనీ, శ్రమపెట్టినందుకు మన్నించమని కోరాడు.

కొన్నిమాసాలు గడిచినాక విమలునికి ఏడేళ్ళ కఠినశిక్ష వేశారని కబురొచ్చింది.

* * *

మళ్లీ మేళతాళాలతో కాళికాదేవికి పూజా ప్రయత్నాలు జరుగుతూ ఉండటం చూసి పరేశుడు తండ్రితో— "ఈ మాటు చేయమాకునాన్నా" అన్నాడు.

"ఎందుకని ?"

"నాకు కష్టంగా ఉంటుంది."

"కష్టంగా ఉంటే ఇవ్వాళా, రేపూ కలకత్తాలో ఉండి రారాదూ ? జగద్ధాత్రిపూజకు అడ్డురాకూడదు !"

పరేశుడు జగద్ధాత్రిపూజకు అడ్డురాలేదని వేరుగా చెప్పటం అనవసరం.

కొన్ని రోజులైనాక ఒకనాటి ఉదయం గురుచరణుని ఇంటిముందు కేకలూ, బొబ్బలూ వినపడ్డవి. కాసేపటికి గొల్లది ఏడుస్తూ హరిచరణుని వేపుకువచ్చింది. దాని ఒంటినిండా బురదా, ముక్కు వెంట



నెత్తురూ ! "సంగతేమిటి మోక్షదా ?" అని హరి అడిగాడు.

దానిఏడ్పుకు ఇంట్లోవాళ్ళంతా పోగయ్యారు. "పాలల్లో నీళ్ళుకలిపానని పెదబాబుగారు నన్ను కందకంలో పడేటట్టు తన్నారు" అన్నది ఏడుస్తూనే గొల్లది.

"ఎవరూ ? అన్నయ్యా ? ఉత్తది," అన్నాడు హరిచరణుడు.

"పెదనాన్నా ? అబద్ధం !" అన్నాడు పరేశుడు.

"బావగారు ఆడదాని వొంటిమీద చెయ్యి వేశారా ? నువ్వేమన్నా కలగన్నావా మోక్షదా ?" అన్నది హరిచరణుని భార్య.

మోక్షదా ఒంటిమీద బురద చూపిస్తూ దేవుడిమీద వొట్టుపెట్టుకుని "అంతా నిజ" మని చెప్పింది. గురుచరణుడు తన్నిందీ యథార్థమే, మోక్షదా గోడకందకంలో పడిందికూడా సత్యమే.

"ఐతే నావెంట రా, చార్జీ యిద్దువుగాని" అన్నాడు హరిచరణుడు.

"ఏమిటి మీకా పిచ్చి ! బావగారు ఆడదాన్ని కొడతారా ?" అన్నది భార్య. పరేశుడు స్తబ్ధుడై నుంచున్నాడు. ఏమీ మాట్లాడలేదు.

"అబద్ధమైతే ఊరకనే పోతుంది. అన్నయ్య నోటినుంచి అబద్ధం రాదు. కొట్టి ఉంటే శాస్తి అనుభవిస్తాడు."

ఈ యుక్తి భార్యకుకూడా నచ్చింది. "అలాగే యివ్వండి. కొట్టిఉంటే శాస్తి అనుభవిస్తాడు" అన్నది.

జరిగిందికూడా అంతే. అన్నయ్య నోటినుంచి అబద్ధంరాలేదు. మాజిస్ట్రేటు పది రూపాయలు జరిమానా వేశాడు.

ఈతఫా మేళతాళాలతో పూజలేమీ జరగలేదు. కాని మర్నాడు గురుచరణుడు బజారుకు రాగానే పిల్లలగుంపు వెంటపడి అల్లరిచేయ ప్రారంభించింది. ఈ మధ్యనే గొల్లదాన్ని కొట్టినందుకు పదంకూడా కట్టారు.

* * *

రాత్రి ఎనిమిది గంటలై ఉంటుంది. హరి

చరణుని పంచపాళీ కళకళ లాడుతున్నది. ఇప్పుడు గ్రామస్థులంతా ఉబుసుపోక కిక్కడికే వస్తున్నారు. ఇవ్వాళ ఆ సభికులంతా కూడారు. ఇంతలో ఒకతను కొత్తవార్త తెచ్చాడు. విశ్వకర్మలు కొంతమంది వీరభద్ర జయంతి చేస్తున్నారనీ, అక్కడ నృత్యం చేయడానికి వాళ్ళు కలకత్తానుంచి ఇద్దరు వేశ్యలను పిలిపించారనీ, గురుచరణుడు కూడా ఆ ఉత్సవం చూస్తూ అక్కడే కూర్చున్నాడనీ చెప్పాడు.

"నీ కేమన్నా పిచ్చా? అన్నయ్య భోగ మాట చూడటానికి పోతాడా? నువ్వేమీ భంగూ గింగూ తాగలేదు కదా, అవినాశ్?" అన్నాడు హరిచరణుడు.

అవినాశుడు వొట్టుపెట్టుకొని "స్వయంగా చూసి వచ్చా'' నన్నాడు.

ఒక మనిషి నిజం తేల్చటానికి అక్కడికి పరుగెత్తుకుంటూ పోయివచ్చి యథార్థమేనని చెప్పాడు. అంతేకాదు, తాగటం కూడా నేను చూశా నన్నాడు. ఇక అక్కడ కూర్చున్న వాళ్లు నోటికొచ్చినట్లు అనసాగారు. 'ఇలా జరుగుతుం దని నే నెప్పుడో అనుకున్నాను' అన్నాడు ఒకాయన. 'ఆడదాన్ని కొట్టి నప్పుడే ఆయనరంగు బైటపడింది' అన్నాడు ఇంకొకాయన. 'కొడుకుచేసిన దొంగతనాన్ని బట్టే తండ్రిసంగతి ఊహించుకోవచ్చు' నన్నాడు మరొకాయన.

హరిచరణుడుమాత్రం ఏమీ మాట్లాడలేదు. పరధ్యానంగా ఉన్నవాడిలా మెదలకుండా ఊరుకున్నాడు. అతనికి చిన్ననాటి సంగతులన్నీ జ్ఞాపకం వచ్చినై. ఈయనేనా తన అన్న?– గురుచరణముజుందార్?

* * *

రాత్రి మూడో ఝామనుకుంటాను. నృత్యం ఇంకా ఆపలేదు. వీరభద్రపూజ పెందలకాడే అయిపోయింది. అయినా భక్తులు మద్య మాంసాలు సేవిస్తూ వేశ్యలచేత నృత్యం చేయిస్తున్నారు. ఒక్కరుకూడా పూర్తి స్మృతిలోలేరు. వారందరిమధ్యలో గురుచరణుడు మాత్రం నవ్వుతూ కూర్చున్నాడు.

ఎవరో ముఖం గుడ్డతో కప్పుకునివచ్చి గురుచరణుని వీపుమీద చెయ్యి వేశారు. అతను వెనక్కుతిరిగి "ఎవరువారు?" అన్నాడు.

"నేనే, పరేశుణ్ణి! ఇంటికి పోదామురా, పెదనాన్నా" అన్నాడు వచ్చిన వ్యక్తి.

"ఇంటికా? పద" అన్నాడు గురుచరణుడు మాటాడకండా.

ఇద్దరూ కలిసి బజార్లోకి వచ్చారు. లోపలి వెలుతురు వాకిటిగుండా అక్కడికి వచ్చిపడుకున్నది. పరేశుడు కాసేపు పెత్తండ్రిముఖంవంక రెప్ప వాల్చకుండా చూశాడు. ఆయన కళ్ళల్లో పూర్వపుతేజం లేదు; భూతం పట్టిన వానిలాగా ఉన్నాడు. ఇన్నాళ్ళయినతర్వాత పరేశుని కళ్ళవెంట నీరు కారింది. పెత్తండ్రి లోకుల్నిచూసి సిగ్గుపడేస్థితిలో లేడనికూడా అతడు తెలుసుకున్నాడు.

"నీకు కాశీకి పోవాలని చాలా ఉండేదిగా, పోతావా పెదనాన్నా?" అన్నాడు పరేశుడు.

"పోతాను, పరేశ్, పోతాను. కాని నన్నెవరు తీసుకుపోతారు?" అన్నాడు దీనుని లాగా.

"నేను తీసుకెళ్తాను, పెదనాన్నా."

"ఐతే, పద. ఇంటికిపోయి సామాను తీసుకెళ్దాము."

"వద్దు పెదనాన్నా! ఇక ఆయింటి కొద్దు. వాళ్ళది మనకేమీ అక్కర్లేదు."

గురుచరణునికి హఠాత్తుగా స్మృతి వచ్చినట్లయింది. కాసేపు మెదలకుండా ఊరుకుని "ఏమీ వద్దా? ఆఇంట్లోది మనకేమీ వద్దా?" అన్నాడు.

పరేశుడు కళ్లు తుడుచుకుంటూ "వద్దు పెద్దనాన్నా! దానికోసం కనిపెట్టుకున్నవాళ్ళు చాలామంది ఉన్నారు. రా!" అన్నాడు.

"పద" అని గురుచరణుడు పరేశుని చెయ్యిపట్టుకున్నాడు. ఇద్దరూ జనశూన్యమైన బాటనే—ఆచీకట్లోనే రైలుస్టేషనుకు బయలుదేరారు.

